ఘనంగా నల్లగంగమ్మ జాతర

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని బహదూరుపేట తెట్టు కూడలి వద్ద వెలసిన నల్లగంగమ్మ జాతర బుధవారం ఘనంగా జరిగింది. ప్రజలు తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించారు. భక్తులు వేపాకు కొమ్మలు, వెయ్యికళ్ల దుత్తలతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. కంఠావీధిలో అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపు చేసి భక్తులు పూజలు చేసుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


సారె తీసుకెళ్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

నల్లగంగమ్మకు ముక్కంటి సారె..

నల్లగంగమ్మ జాతరను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ముక్కంటి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారిగా నల్లగంగమ్మ అమ్మవారికి సారె సమర్పించినట్లు తెలిపారు. ఇకపై ఏటా ఆలయం తరఫున సారె అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు సతీష్ మాలిక్, నాగభూషణం యాదవ్, హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ మూలమూర్తి


ఊరేగింపులో నల్లగంగమ్మకు హారతి ఇస్తున్న అర్చకుడు

మానవ వికాస కేంద్రాలుగా ఆలయాలు

శ్రీకాళహస్తి రూరల్: హైందవ ధర్మంలో దేవాలయాలు మానవ వికాస కేంద్రాలుగా వర్ధిల్లుతున్నాయని తొట్టంబేడు, రేణిగుంట మండలాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు. మండలంలోని వెలంపాడు గ్రామంలో బుధవారం ఘనంగా పోలేరమ్మ జాతర నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆమె వెలంపాడు గ్రామానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ మన ఆధ్యాత్మిక సంపదను భావితరాల వారికి తెలియ పరచాల్సిన ఆవశ్యకత మన అందరిపై ఉందని తెలిపారు. మానవుల సర్వతోముఖాభివృద్ధికి భక్తి మార్గమే ఏకైక మార్గమని చెప్పారు. ఆలయాల ద్వారా ఆధ్యాత్మికం, జ్ఞానం, విద్య, సాంస్కృతిక చైతన్యాన్ని పొందుతామని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో వందలాది ఆలయాలను నిర్మించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయా లు లేకపోతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువస్తే మంజూరు చేయిస్తారని వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాయుడు, విజయ్‌కుమార్‌నాయుడు, మల్లిఖార్జున్‌మొదలియార్, శశిరాయల్, ప్రసాద్‌నాయుడు, పుల్లూరు మనోహర్‌రెడ్డి, పెంచలరెడ్డి, నరసింహారెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న బియ్యపు పవిత్రారెడ్డి

కాలభైరవ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


నేతి దీపాలు వెలిగిస్తున్న భక్తులు


రామగిరిలో అష్టమి పూజలు చేస్తున్న భక్తజనం

పిచ్చాటూరు: మండలంలోని రామగిరిలో వెలసిన కాళికాదేవి సమేత సంతాన కాలభైరవ స్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. బుధవారం త్రైపుర అష్టమి సందర్భంగా కాళికాదేవి సమేత కాళభైరవ స్వామి, వాలీశ్వర స్వామి, మరగదాంబిగ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రమిదలు, గుమ్మడికాయలతో నేతి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. పల్లవుల కాలంలో నిర్మించిన ఈ ఆలయానికి క్షేత్రపాలకుడిగా కాలభైరవుడు కొలువై ఉన్నాడని ప్రతీతి. ప్రతి 15 రోజులకు ఒకసారి వచ్చే అష్టమి పూజలకు వేలాదిగా భక్తులు వస్తారని అర్చకులు తెలిపారు. ప్రధాన అర్చకులు శంకర్ రాజ్ గురుక్కుళ్, సిబ్బంది పర్యవేక్షించారు.

క్లుప్తంగా

నీటి నాణ్యతపై పరీక్షలు


నీటి నాణ్యతను పరీక్షిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరణ్

శ్రీకాళహస్తి రూరల్: తొట్టంబేడు మండలంలోని పూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో జలజీవన్ కార్యక్రమంలో భాగంగా నీటి నాణ్యత పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరణ్ నీటి నాణ్యతను పరీక్షించారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ టీం లీడర్ ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పరిశుభ్రమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో జలజీవన్ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. పరిశుభ్రమైన నీటిని తాగడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. వేసవి కాలంలో ఎక్కువగా నీరు తాగాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు విష్ణుప్రసన్న



శ్రీకాళహస్తి రూరల్: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు శ్రీకాళహస్తి మండలం ఓబులాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విష్ణుప్రసన్న ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయుడు బాలయ్య బుధవారం తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ఎంపిక ఆన్‌లైన్‌లో జరిగినట్లు చెప్పారు. విద్యార్థిని విష్ణుప్రసన్న రూపొందించిన 'ఎకో కూలర్' ప్రాజెక్టు ఎంపిక అయినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి


విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి

సత్యవేడు: పిల్లల్లో ప్రాథమిక స్థాయి నుంచే విద్యా సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు పాటించాలని జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం కొత్తమారికుప్పం ఎస్టీ కాలనీ పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం, సర్పంచ్ డి.నాగమ్మ, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు విద్యార్థి ఎంపిక



సంతోష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల్లో 7వ తరగతి చదువుతున్న సంతోష్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా సంతోష్ ఆన్‌లైన్‌లో చెత్త సేకరణ కోసం ఎలక్ట్రికల్ చెత్త బుట్ట నమూనా తయారుచేశాడు. దీంతో అతన్ని ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సైన్స్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


చెట్టుకు వేలాడుతున్న వ్యక్తి మృతదేహం

రేణిగుంట: మండలంలోని రేణిగుంట-అన్నాసామిపల్లి మార్గంలో రోడ్డు పక్కన ఓ చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. స్థానికుల రేణిగుంట పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకి దించి పరిశీలించారు. మృతుడు తాను కట్టుకున్న లుంగీతో చెట్టు కొమ్మకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుడు సుమారు 55 ఏళ్లు కలిగి ఉంటాడని, మృతుని జేబులో ఏర్పేడు నుంచి రేణిగుంటకు పల్లెవెలుగు బస్సులో ప్రయాణించినట్లు ఈరోజు ఉదయం తీసుకున్న టికెట్ లభ్యమైంది. అయితే మృతుడు ఎవరనేది తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతుని చేతిపై ఆర్.పురుషోత్తం అనే పేరు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

- సప్తగిరి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జయకుమార్


మాట్లాడుతున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ జయకుమార్

శ్రీకాళహస్తి రూరల్: డ్వాక్రా మహిళా సంఘాలకు బ్యాంకులు అందిస్తున్న రుణాలను అనవసరపు ఖర్చులకు వెచ్చించకుండా వాటిని సక్రమంగా వినియోగించుకుని డ్వాక్రా సంఘాలకు చెందిన కుటుంబాలు ఆర్థిక సుస్థిరతను ఏర్పరచుకోవాలని సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ జయకుమార్ అన్నారు. తొట్టంబేడు మండలంలోని తొట్టంబేడు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్‌లో బుధవారం రుణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మహిళా ఖాతాదారుల సంఖ్య అధికంగా ఉందన్నారు. బ్యాంకు ఆర్థిక విజయం సాధించడంలో మహిళల పాత్ర ప్రధానమని కొనియాడారు. గత 30 రోజుల వ్యవధిలో తిరుపతి రీజనల్ పరిధిలో రూ.125 కోట్లు మేర స్వయం సహాయ సంఘాలకు రుణాలను అందించినట్లు చెప్పారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందినప్పుడు వాటి ద్వారా కుటుంబం అభివృద్ధి చెందే విధంగా వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంకు ఇచ్చిన రుణాలతో పాటు ఇచ్చే గేదెలను పట్టుకోవడం, లేదా చిన్నచిన్న కిరాణ కొట్టు పెట్టుకోవడం, గొర్రెలు, మేకలు పెంపకం చేయడం ఇలా ఎవరికి అనుకూల రీతిలో అభివృద్ధి చేసుకుంటే తద్వారా వచ్చే ఆదాయంతో రుణాలు తీర్చుకోవచ్చన్నారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాలు బ్యాంకులతో లావాదేవీలు పెంపొందించుకోవాలంటే తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ దినేష్ పాల్గొన్నారు.

శేషాచల అడవుల్లో మంటలు


అంజిమేడు సమీపంలో దగ్ధమవుతున్న శేషాచల అడవులు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు, సీతారాంపేట, ఏర్పేడు సమీపంలోని శేషాచల అడవుల్లో బుధవారం మంటలు ఏర్పడ్డాయి. గుర్తు తెలియని వ్యక్తులు అడవులకు నిప్పుపెట్టారు. సుమారు 5 కిలోమీటర్ల మేరకు అడవుల్లో మంటలు ఎగసి పడుతున్నాయి. వృక్ష, పక్షి, జంతు సంపద మంటల్లో దగ్ధమవుతున్నాయి. ఎండాకాలం ప్రవేశించకముందే అటవీ శాఖ అధికారులు గ్రామాల్లో సమావేశాలు జరిపి అడవులపై అవగాహన కల్పించాల్సి ఉంది. అధికారులు అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో అవగాహన కల్పించకపోవడంతో అడవులు దగ్ధమవుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని అడవులు అగ్నికి ఆహుతి కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

శ్రీకాళహస్తి: ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పురపాలకసంఘ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ బాలాజీ నాయక్ కోరారు. బుధవారం ఆయన పురపాలకసంఘ సిబ్బందిని బృందాలుగా నియమించి పలు వార్డులకు పంపించారు. వారు అధిక బకాయిలు ఉన్న కొళాయి కనెక్షన్లను తొలగించారు. అదేవిధంగా దుకాణాలకు తాళాలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్నులు సకాలంలో చెల్లించాలని, లేనిపక్షంలో అపరాధరుసుంతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. పురపాలకసంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు నారాయణరెడ్డి, రవికాంత్, బాలచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్, ప్రెస్ స్టిక్కర్లు అంటిస్తే కేసులు

తిరుపతి రూరల్: అనధికారికంగా పోలీస్, ప్రెస్ అంటూ వాహనాలపై స్టిక్కర్లు అంటిస్తే కేసులు నమోదు చేస్తామని ఎంఆర్‌పల్లి ఎస్‌ఐ వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఆయన బుధవారం సాయంత్రం ఎంఆర్‌పల్లిలో వాహనాలను తనిఖీ చేశారు. కొందరు అనధికారికంగా పోలీస్, ప్రెస్ అని స్టిక్కర్లు వేసి ఉండడాన్ని గుర్తించి తీసివేయించారు. మొదటి తప్పుగా భావించి స్టిక్కర్లు తొలగించామని, మరోసారి అనుమతి లేకుండా స్టిక్కర్లు అంటిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఏర్పేడు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లుతో సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. బుధవారం ఎండీపుత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలు ప్రతిరోజు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పప్పుదినుసులు, మాంస కృత్తులతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియదర్శిని, అంగన్‌వాడీ కార్యకర్త విమలకుమారి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న మోహనప్రియ

నాగలాపురం పంచాయతీకి రూ.5 లక్షల ఆదాయం

పిచ్చాటూరు: మండల కేంద్రమైన నాగలాపురం పంచాయతీకి చెందిన వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్(ఆర్టీసీ మినహా), జంతువధ శాలకు బుధవారం వేలం పాటలు నిర్వహించారు. ఇందులో వారపు సంత రూ.1.58 లక్షలు, దినసరి కూరగాయల మార్కెట్ రూ.1.51 లక్షలు, బస్టాండ్ రూ.1.53 లక్షలు, జంతువధశాల రూ.45 వేలకు కాంట్రాక్టర్లు దక్కించుకున్నట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు.

పంచాయతీకి రూ.5.07 లక్షల ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ, మాజీ సర్పంచ్ చిన్నదొరై, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వేలంపాటలు నిర్వహిస్తున్న ఎంపీడీవో పద్మజ

ముమ్మరంగా కాజ్‌వే నిర్మాణ పనులు

ఏర్పేడు : మండలంలోని కొత్తవీరాపురం వద్ద స్వర్ణముఖి నదిపై నూతనంగా నిర్మిస్తున్న కాజ్‌వే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి కాజ్‌వే పనులను పరిశీలించారు. గతంలో నిర్మించిన కాజ్‌వే దుస్థితికి చేరుకోవడంతో మోదుగులపాలెం, సదాశివపురం, కందాడు, సరస్వతికండ్రిగ, రాజులకండ్రిగ, ఎండీపుత్తూరు, మడిబాక, ముసలిపేడు తదితర గ్రామాలకు చెందిన ప్రజలు వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది పడేవారు. విషయం తెలిసి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ప్రభుత్వం నుంచి కాజ్‌వే నిర్మాణానికి రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేయించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజేంద్ర, వెంకటేశ్వర్లు, శ్రీహరి, కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తవీరాపురం వద్ద జరుగుతున్న కాజ్‌వే పనులు

సబ్సిడీతో వరిగడ్డి కట్టలు కట్టే యంత్రం


గడ్డిని కట్టలు కట్టే యంత్రం


గడ్డిమోపు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో వరిగడ్డిని కట్టలు కట్టేయంత్రాన్ని ఇస్తోందని వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు. ఆమె బుధవారం యంత్రం పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు వరిగడ్డిని యంత్రంతోనే మోపులు కట్టవచ్చని, తద్వారా గడ్డి వృథా కాదన్నారు. సమయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ బీమా అందజేత

సత్యవేడు: మండలంలోని కొత్తమారికుప్పం పరిధిలోని అమాసరెడ్డి కండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన రవి(50) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు వైఎస్సార్ బీమా వర్తించింది. ఈ క్రమంలో వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం రూ.10 వేలను ఆయన కుటుంబ సభ్యులకు జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి, సర్పంచ్ డి.నాగమ్మ, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ కార్యదర్శి మునిరవికుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ శామ్యూల్, సచివాలయ కన్వీనర్ రాజశేఖర్, శీనివాసులు రెడ్డి, వలంటీర్లు అరుణ, గోమతి తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ బీమా అందజేస్తున్న జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి

త్వరితగతిన సుస్థిర ఆర్థిక లక్ష్యాల సర్వే

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుస్థిర ఆర్థిక లక్ష్యాల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌చార్జ్ అధికారిణి సుశీలాదేవి తెలిపారు. ఆమె బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులతో ఎస్‌డీజీపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ 19 ఏళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. వయస్సు తగ్గ పోషకాలను అందించడం ద్వారా ఎత్తు, బరువు సమంగా ఉంటుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని వృథా చేయకుండా చూడాలని తెలిపారు. అనంతరం ఆధార్, ఏపీ సర్వీస్, సీఆర్‌యాప్, సచివాలయాలపై సమీక్షించారు. ఎంపీడీవో త్రిక్రమ్‌రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుశీలాదేవి

ప్రకృతి వ్యవసాయంతో పుడమిని రక్షిద్దాం

నారాయణవనం: ప్రకృతి వ్యవసాయంతో భూసారాన్ని కాపాడుకుందామని వ్యవసాయశాఖ పుత్తూరు ఏడీ రమేష్ తెలిపారు. ఆయన బుధవారం సముదాయం రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం ద్వారా భూమి నిస్సారమవుతుందన్నారు. కమ్యూనిటీ ప్రకృతి వ్యవసాయానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదేవిధంగా సాగులో యంత్రాలను వినియోగించి ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. సంఘాలుగా మారి కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుని రైతులకు కావలసిన యంత్రాలు, పరికరాలను తక్కువ బాడుగకు తీసుకోవచ్చని చెప్పారు. నవధాన్యాల పచ్చిరొట్ట పంటలను సాగు చేస్తే భూసారంతో పెరిగి చీడలు, తెగుళ్లు తగ్గుతాయని వివరించారు. అనంతరం బంకమట్టి, ఘనజీవమృతం, బూడిదతో విత్తన శుద్ధి చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, వ్యవసాయ సహాయకులు నందిని, సుభాషిణి, ప్రకతి వ్యవసాయ కార్యకర్తలు సురేష్, భారతి పాల్గొన్నారు.


విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


నాగలాపురంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 61 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 56 మంది హాజరయ్యారు. పరీక్షల కోసం మూడు గదులు కేటాయించారు. అందులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గురువారం ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష జరుగుతుందని, దీనికి 79 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల్లో 224 మంది విద్యార్థులకు గాను 216 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఇతర వస్తువులు లోనికి తీసుకువెళ్లకుండా తనిఖీ చేశారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 441 మంది హాజరు

పిచ్చాటూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 448 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 441 మంది హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ రమాదేవి తెలిపారు. ఏడుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఇంటర్ ఫస్టియర్ తెలుగు, తమిళ్, హిందీ సంస్కృతం పరీక్షలు ప్రారంభమయ్యాయి. పిచ్చాటూరు జూనియర్ కళాశాలతో పాటు కేవీబీపురం మోడల్ స్కూల్, కేజీబీవీ కళాశాల, పిచ్చాటూరు, నింద్ర, విజయపురం హైస్కూల్, ప్రైవేటు కళాశాలలైన జోష్, జేబీఆర్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు.

నాగలాపురంలో..

నాగలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 233 మంది హాజరు కావాల్సి ఉండగా 230 హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ షమీర్ తెలిపారు. నాగలాపురం జూనియర్ కళాశాలతో పాటు అక్షర ప్రైవేటు కళాశాల, జెడ్పీ హైస్కూల్‌లోని ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాసినట్టు పేర్కొన్నారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.